

రాత్రి పది దాటింది.

టేబులు చుట్టూ కూర్చున్నారు వాళ్ళు నలుగురూ. వాళ్ళ చేతుల్లో గ్లాసులున్నాయి. టేబుల్ మీద సీసాలున్నాయి. కాంబినేషన్‌గా తినుపదార్థాలూ వున్నాయి.

ఛీర్స్!'!

—నాలుగు గొంతులూ ముక్తంగా పలికాయి.

వాళ్ళు యవ్వనంలో వున్నారు. ఆరోగ్యంగా వున్నారు. బలిసి వున్నారు. కొవ్వు పట్టి వున్నారు.

వాళ్ళు వికారంగా ఏమీ లేరు. విలన్లలాగానూ లేరు.

వాళ్ళు నాజూగ్గా వున్నారు, అప్‌టు డేట్‌గా వున్నారు. హీరోల్లా వున్నారు, హీరోల బాబుల్లా వున్నారు.

వాళ్ళు అందంగా వున్నారు, ఆహ్లాదంగా కనిపిస్తున్నారు. సంస్కృతికి ప్రతిరూపాల్లా వున్నారు సంతోషాలకి ప్రతినిధుల్లా కనిపిస్తున్నారు. దిగుళ్ళకు దూరంగా వున్నారు, దరిద్రులకి కలలు తెప్పించేట్లున్నారు.

వాళ్ళ పరిచయాలు ఇలా పరిమళిస్తుంటాయి.

నెంబర్ వన్—చంద్రం—ఎక్స్ ఎమ్మెల్యే మరియూ ప్రస్తుతపు ఎంపీకి కొడుకు. చదువు వంటపట్టనివాడూ, చదువు మధ్యలో వదిలి పెట్టినవాడూ. ఒక షుగర్ ఫ్యాక్టరీకి డైరెక్టరూ, ఒక పెట్రోల్ బంక్ కి డీలర్ షిప్ సంపాదించిన వాడూ. ఆ టౌన్లో కాసనోవాగా ప్రసిద్ధికెక్కిన వాడూ, అభినవ రాకుమారుడూ, చేతిలో కారున్న వాడూ, చేతిక్రింద గూండాలున్నవాడూనూ.

నెంబర్ టూ — గోపాల్ — అక్కడి డి ఎస్పీకి కొడుకు. జులాయిగా పెరిగినవాడూ, బలాదూరుగా తిరిగినవాడూ. తండ్రి హోదానీ దర్పాన్నీ తండ్రి స్టాఫ్ ముందు ప్రదర్శించే వాడూ, ఊళ్ళో ఉపయోగించుకుంటున్నవాడూ. ఇతను దుర్యోధనుడైతే తండ్రి ధృతరాష్ట్రుడు. ఇతను సంజయుడైతే తండ్రి ఇందిరడు.

నెంబర్ త్రీ—మౌళి—ఆ టౌన్లోకెల్లా పెద్దదైన టాకీసుకి వోనరు తల్లి చనిపోయిన వాడూ, తండ్రి తెలియనివాడూ. పుట్టుకతో కర్ణుడూ, పెరుగుతూ రావణుడూ. ఒక ఖూనీ కేసునుంచి తప్పించుకున్నవాడూ, ఇద్దరు పడతుల మానాల్ని మలినించినవాడూ రాక్షసాంశను జీర్ణించుకున్నవాడు!

నెంబర్ ఫోర్ — ప్రకాష్ — ఆ టౌనుకి దాదా అయితే అక్కడి ప్రజలకు దుస్స్వప్నం. ఒక చేతిలో చాకూ, ఎదురుగా పుస్తకాలతో పరీక్షలు రాసి చదువు ముగించినవాడు. యస్సైని కావాలని శతధా ప్రయత్నించీ ఒక నిజాయితీ గల పోలీసు అధికారి మూలంగా కాలేకపోయిన వాడు. వెయ్యి రూపాయలకు ప్రత్యర్థి చేయీ, పదివేలకు వాడి తలకాయా నరుక్కువచ్చి చేతి కందించే ప్రబుద్ధుడు!

చాలా సహజంగా కలిసింది వాళ్ళ స్నేహం. క్రమేణానూ అవసరానుగుణంగానూ అది చిక్కబడుతూ వచ్చింది

ప్రస్తుతం వాళ్ళు నెమరేస్తోన్నారు, సిప్ చేస్తోన్నారు. వదరుతున్నారు, పేట్రేగిపోతున్నారు.

హఠాత్తుగా ఒకడికి జ్ఞప్తికొచ్చింది.

"అవును చంద్రం, నీ మిసెస్ ఊళ్ళో లేదు కదూ?"

"లేదురా, రెండు నెలలక్రితమనగా పుట్టింటికి వెళ్ళింది. ఇంతవరకూ రాలేదు. ఈ ఆస్తి పరుల పిల్లల్ని చేసుకుంటె ఇదే చావు!"

"మరి ఈ రెండు నెలలనుంచీ రాత్రులు కాలమెట్లా గడుపుతున్నావు బ్రెదరూ?"

"తడిగుడ్డమీద వేసుకుని బ్రతుకుతున్నా న్రా నాయనా?"

పెళ్ళున నవ్వారు నలుగురూ.

"మొన్నటిదాకా ఎలిజిబెత్ వుండటంతో పెద్ద బాధ అనిపించలేదు గానీ వారం క్రితం అది సెలవుమీద వెళ్ళిపోవటంతో అప్పణ్నించీ మాత్రం బాధంటే బాధగా వుందిరా."

"పాపం, పిచ్చి కన్నయ్య!!"

"లాడ్జింగ్ సరుకును ఎవర్నన్నా పట్రమ్మంటావా గురూ, ఎంజాయ్ చెద్దాం."

"ఛ ఛ, ఈ కంపెనీ సరుకంటే నాకు పరమ ఎలర్జీ. సంసారం చేసుకునేదన్నా కావాలి, లేక ఫ్రెష్ ఫ్లవర్ అన్నా అయివుండాలి మనకు."

"అవునులే, సింహం గడ్డి పోచకు ఆశిసుందా?"

"లాడ్జింగులకి సంసారపు స్త్రీలుకూడా వస్తోంటారు గురూ. అలాంటి వాళ్ళనే పట్టుకుందాము ఎమంటావ్?"

"పోరా, అదో ఎట్రాక్షన్ అన్చెప్పి ఆ ముండలంతా అలాగే వాగుతుంటారు"

"అయితే ఇప్పుడేమి చేద్దామంటావు? పోనీ ఎవర్నన్నా ఎతుకొద్దామంటావా?"

"కిడ్నాపింగ్?"

"య్యా!"

"ఎవర్ని?"

"ఎవరో ఒకరు! ఊళ్ళోకి పోతే గూట్లోంచి బయటకొచ్చిన పిట్ట ఎవతో ఒకతి దొరక్కపోతుందా?"

"గుడ్ ఐడియా, నీకు నోబుల్ ప్రైజు ఇవ్వవచ్చోయ్!"

"ఆ పిట్ట ఎలా వుండాలంటే—ఛికెన్ లా - లేతగా—నవనవలాడుతూ."

"చికెన్ లా ఏమిటిరా బాబూ, తింటావా ఏమిటి?"

"తినటమా మరీనా! నంజుకోనూ "

"సర్లే సర్లే! అవునుగాని మౌళీ, నువ్వు కారు తెచ్చావుకదూ?''

"ఆహా, బయటే వుంది "

"అయితే పదండి!"

"మన నలుగురికీ నాలుగు పిట్టలు దొరుకుతా యంటావా?''

"పోరా, నీకెప్పుడూ సందేహాలే. లేత ఆడది, నవనవలాడుతున్నది ఒక్కటి దొరికితే చాలు. చంద్రానికి ఫస్ట్ ప్రిఫరెన్సిద్దాం, తర్వాత మనమూ "

"వొద్దు లెండిరా, మీకోసం నేనివ్వాళ త్యాగం చెయ్యదల్చుకున్నాను. దొరకాలేగాని అందరం ఉమ్మడిగా ఎంజాయ్ చేద్దాం.''

"హుర్రా, హుర్రా!!''

గ్లాసుల్లో మిగిలిన ద్రవాన్ని కాస్తా ఖాళీచేసి, వాళ్ళు బయటికి కదిలేసరికి రాత్రి ఒంటిగంట అవుతోంది

## 2

తెల్లటి జవుజు, తెల్లటి వోణీ, కాఫీరంగు పరికిణీ—

టీనేజ్ కన్య!

అప్పుడే వికసిస్తోన్న పుష్పంలా వుందామె. చామనచాయ. రూపంలో ఎక్కడో ఏదో ఫ్రెష్ నెస్, ఫ్రాగ్రన్స్. కనుగ్రుడ్లు తెల్లగా, స్వచ్ఛంగా, మల్లెపువ్వుల్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. వర్షం కురిసి వెలిసాక పచ్చటి కొండల్ని చూస్తోన్న వ్వటి అనుభూతి కలుగుతుంది ఆమెను చూస్తోంటే. సరస్సులో ఆడిఆడి అప్పుడే వడ్డు కొచ్చిన అరబ్బీ గుర్రపు వొంటి నునుపుదనం ఆమెది. ఒక చేయి పైకెత్తినప్పుడు ఆ సందు లోంచి కనిపించే ఆమె ఉబుకులు - పొట్టకు కొంచెం పైనుంచి తలెత్తుతూ, వోణీ మడతల్లోకి పరుగెత్తుతూ—వొంట్లో ఎక్కడో నరాలన్నీచ్చి నొక్కినట్లు కలించే భావన కల్గుతుంది ఇవతలి వాళ్ళకు ఆరోగ్యంతోమిసమిసలాడుతోందామె. ఆమెలోని యవ్వనం నరాల్ని చీల్చుకుని, శరీ రాన్ని చిట్లగొట్టుకుంటూ బయటికి రావటానికి ప్రయత్నిస్తోందా అన్నట్లుంది.

ఆమె పేరు భావన.

భావన నడుస్తోంది. ఆమె చాలా ఉత్సా హంగా వుంది. అంతకు క్రితమే సెకండ్ షో వదిలారు. మరో ఇద్దరు మిత్రురాళ్ళు—రమ, ఉమలతో కలిసి సినిమా చూసిందామె. వాళ్ళి ద్దరూ కాస్త కలిగినవాళ్ళు. క్రితంరోజే పరీక్షలు పూర్తికావటము, ముగ్గురూ సంతృప్తికరంగా పరీక్షలు రాయటమూ జరగటంతో ఆ ఉత్సా హంలో రమ ఈరోజు సినిమా ప్రోగ్రాం పెట్టింది. ఫస్ట్‌షోకి వెళ్ళినట్లయితే బాగుండేది కాని రమ వాళ్ళింట్లో భోజనాలు కారణంగా ఆలస్యమయిపోయి సెకండ్‌షోకి రావాల్సి వచ్చింది. వాళ్ళిద్దరు వెళ్ళాల్సింది వేరే రూటు కావటంతో వాళ్ళు కాస్తా రిక్షా చేసుకుని వెళ్ళి



పోయారు. ఇక మిగిలింది భావన. ఆమె ఇల్లు అక్కడికి దగ్గరలోనే వుంది రెండు వీధులు దాటాలి. రిక్షాలో వెళ్ళమంటూ రమ రెండు రూపాయలిచ్చింది. అసలు వాళ్ళు భావననే ముందు రిక్షా ఎక్కించి వెళ్దామనుకున్నారు కాని భావన అందుకు ఒప్పుకోలేదు. తనే ఓ రిక్షా మాటాడి వాళ్ళను అందులో బలవంతాన పంపేసింది. నడుచుకుంటూ పోయి ఆ రెండు రూపాయల్నీ ఆదా చేయాలన్నది ఆమె ఉద్దేశ్యం ఇంట్లో మూడ్రోజుల నుంచీ కాఫీపొడి లేదు. తన తండ్రికి కాఫీ లేకపోతే బండి నడవదు. పాపం ఎలాగో ఈ మూన్నాళ్ళనుంచీ నెట్టుకొస్తోన్నాడు. ఈ కాస్త దూరాన్నీ నడిచిపోతే ఆయనకింత సహాయాన్ని చేసినట్లవుతుంది. అయినా ఎంతదూరం గనీ

"జాగ్రత్తగా వెళ్ళు భావనా!"

పోతూ పోతూ రమచేసిన హెచ్చరిక గుర్తు కొచ్చి నవ్వుకుందామె. తనేమైనా చిన్నపిల్లా చితకపిల్లానా భయపడటానికి?? (చిన్నపిల్లకాదు కాబట్టే జాగ్రత్తపడాలన్నది ఆమెకు తట్టలేదు. ఆమె వయస్సూ, ఆమె చూసిన సినిమాలూ ఆమెలో అలాంటి వివేకం ఏర్పడకుండా అడ్డుకున్నాయి )

ఆ వీధి చివరిదాకా వచ్చిందామె. ఆ మూల వీధిలైటు దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ వెల్తురులోంచి నడుస్తోందామె. మరో వీధి దాటితే తన ఇల్లు వచ్చేస్తోంది. ఈ కాస్త దూరానికి రెండు రూపాయలట

దీపస్తంభం క్రిందికి వచ్చిందామె. ఇప్పుడా వెల్తురులో ఆమె రూపం మరింత స్పష్టంగా కనిపిస్తోంది పుష్టిగా, ఆరోగ్యంగా, డ్రీమీగా...

ఒక చిన్న ఫియట్ కారు నెమ్మదిగా ఆమెను దాటుకుంటూ వెళ్ళింది.

తను వెళ్ళాల్సిన వీధిలోకి మళ్ళింది భావన అదురూ బెదురూ లేకుండా దర్పంగా నడుస్తుందామె. అంతకు క్రితం చూసిన సినిమాలో దృశ్యాలే మెదుల్తున్నాయి ఆమె మనస్సులో. అందులో హీరోయిన్ చాలా పేదపిల్ల. కాలేజీలో చదువుతుండగా ఒక యువకుడి ప్రేమలో పడుతుంది. అతనో పెద్ద ధనికుడి కొడుకు. పెద్ద కార్లూ బంగళాలూ వుంటాయతనికి. సగం సినిమా గడిచేసరికి విడిపోవాల్సి వస్తుంది వాళ్ళు. అంతస్తులు తేడా కారణంగా. మధ్యలో కష్టాలు, విరహ గీతాలూ, మొత్తానికి సినిమా ముగిసే సమయానికి పెద్దవాళ్ళు వప్పుకోటంతో మళ్ళీ ఆ ఇద్దరూ కలుసుకుంటారు. కారులో డ్యూయెట్ పాడుకుంటూ పోతుండగా 'శుభం' కనిపిస్తుంది

సన్నటి నవ్వు భావన పెదాలమీద కదిలింది. తనూ పేదపిల్లే. ఇంటరు పరీక్షలు రాసింది. వచ్చేయేడు బియస్ సీలో జేరుతుంది. ఆ తర్వాత?? అదేదో మిరకల్ జరగవచ్చునని ఆమె మనస్సు హెచ్చరించి మరీ చెబుతుందామెకు.

ఒక వంతు వీధిని దాటిందామె. మరో రెండువంతులు నడవాలి. ఆ తర్వాత వంపు తిరిగితే వచ్చే నాల్గో ఇల్లే తమ ఇల్లు.

అక్కణ్ణించీ అయిదారు దీపస్తంభాలదాకా లైట్లు వెలగటంలేదు. అక్కడంతా కటిక చీకటి. అలా లైట్లు వెలగని దీపస్తంభాలు ఆ టౌన్లోని మిగతా మరికొన్ని వీధుల్లో ఇంకా అనేకం వున్నాయి. చానాళ్ళనుంచీ ఆ లైట్లు అలా వెలగటంలేదు. ఈ మధ్యనే ప్రభుత్వ రికార్డుల్లో వాటికి సంబంధించిన బల్బులు బిగించబడ్డట్లుగా ఖర్చు రాయబడింది కాని తత్సంబంధిత సొమ్మంతా మాత్రం అదే టౌన్‌లో మరో వీధిలో తన మూడో కూతురికి పెళ్ళి చేస్తోన్న డివిజనల్ ఇంజనీరు ఇంటికి దేదీప్యమానంగా వెలిగించటానికి ఉపయోగించబడింది.

మరి ఇక్కడ ఈ చీకటిలో??

ఆ చీకటి వద్దకు రాగానే భావన ఒక్క క్షణం భయపడింది. వీధి వీధంతా నిర్మానుష్యంగా వుంది ఆమె భయం మనుష్యుల గురించి కాదు, చిన్నప్పణ్ణించీ తను పెరిగిన ఆస్తిక వాతావరణం తాలూకు పిశాచ సంబంధిత అజ్ఞాత రూపాల గురించి! అదీకాక ఆ ప్రదేశంలో అంతకు నాల్గురోజుల క్రితం యాక్సిడెంటు జరిగి




ఓ మనిషి చనిపోయాడు. ఛన్నాభిన్నమైన ఆ శవాన్ని ఆమె చాలా దగ్గరనుంచి చూసి వుంది. ఇక్కడెక్కడో ఆ బాపతు ప్రేతం కల దిరగడం లేదుకదా?!

క్షణం తటపటాయించాక గుండెను దిటవు పర్చుకుని అడుగు ముందుకు వేసింది భావన - ఆ చీకటిలోకి.

సగం చీకటిని అధిగమించగానే హటాత్తుగా ఆమెలో కొండంత ధైర్యం ప్రవేశించింది. అందుకు కారణం ఎదురుగా కొంత దూరాన రోడ్డు పక్కనే ఆగివున్న తెల్లటి కారు! ముగ్గురు నలుగురు మనుష్యులు కారువద్ద వొంగుని ఏదో రిపేరుగావును చేసుకుంటున్నారు. అమ్మయ్య. ఇక్కడెవరో మనుష్యులున్నారు, తనింక ఏ దయ్యంగురించీ భయపడాల్సిన పని లేదు!

ఉత్సాహంగా ముందుకు నడిచిందామె. కాని, కాని

కారువద్దకు రాగానే ఆమె ఊహించని సంఘటన జరిగింది. దెయ్యాలగురించి ఝడుస్తూ ఏ మనుష్యలను చూసి ధైర్యం తెచ్చుకుందో అ మనుష్యులే ఆమెమీదకు దయ్యాల్లా విరుచుకు పడ్డారు. ఒకడు ఆమె నోరు మూస్తే ఇద్దరు ఆమెను వొడిసి పట్టుకున్నారు. మరోడు కారు స్టార్టు చేసాడు.

ముగ్గురు కలిసి ఆమెను వెనకసీట్లోకి జేర్చారు.

ఏమి జరిగిందో, ఎందుకు జరుగుతుందో ఆమెకు తెలిసే లోపునే కారు ముందుకు దూసుకుపోసాగింది

## 3

రాత్రి రెండయింది.

వీధిలోకీ ఇంటిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు వైకుంఠం మేష్టారు. ఆయన మనస్సంతా ఆందోళనతో నిండి వుంది.

రమ వాళ్ళతో కలిసి సినిమాకు పోతానని వెళ్ళింది భావన. ఇంకా రాలేదు. ఫస్టుషో అంద లేదా? సెకండ్ షోకి పోయినాగాని ఈసరికి వచ్చి వుండాల్సిందేనే

'భావనా! నా చిట్టి తల్లీ!!'-మూలిగిందాయన మనస్సు.

పిచ్చి తల్లికి తనంటే ఎంతో ప్రేమ. ఇప్ప టికీ ఎప్పుడన్నా అన్నం తింటున్నప్పుడు తన వద్దకు వచ్చి ముద్ద పెట్టించుకుంటుంది. ఆరేళ్ళ క్రితమనగా లక్ష్మి—తన భార్య చనిపోయింది. అప్పట్నించీ తను కంటికి రెప్పలా కాపాడు

కొస్తున్నాడు. పిచ్చితల్లి, ఎంత ముద్దుగా మాట్లాడుతుంది!? బాగా చదువుకుని కలెక్టరవుతుందట. కలెక్టరై తన కష్టాలన్నీ తీరుస్తుందట. లేకపోతే డాక్టరై తన అనారోగ్యాన్నంతా తీసి వేస్తుందట

చిన్నగా నవ్వుకున్నాడాయన.

ఇంకా ఎందుకు రాలేదబ్బా!?

వీధిలో ఏదో చప్పుడయితే చటుక్కున గడపలోకి వచ్చాడు.

ఒక చిన్న కారు ఇంటి ముందునుంచి దూసుకుపోయింది.

నిరాశగా నిట్టూర్చాడు వైకుంఠం మేష్టారు.

తొమ్మిదింటి నుంచి ఎదురుచూస్తోన్నాడాయన. భావన జాడే లేదు. ఎటుపోయింది? ఎక్కడుంది? ఏం చేస్తోంది??

ఏ ఆపదా సంభవించలేదు కదా? రోజులసలే బాగాలేవు.

క్షణక్షణానికి ఆయనలో ఆందోళన, ఆదుర్దా పెచ్చరిల్లసాగాయి. గుండెల్లో టెన్షన్ వుక్కిరి బిక్కిరి చేయసాగింది.

చిట్టితల్లి యింకా రాలేదు, యింకా రాలేదు, యింకా రాలేదు

"భావనా ఏం చేస్తున్నావమ్మా? ఎక్కడున్నావమ్మా??"

ఆక్రోశించిందాయన మనస్సు

## 4

ఒంపు తిరిగి ఓ కాంపౌండులోకి ప్రవేశించింది కారు.

ఒకళ్ళు డ్రైవు చేస్తున్నారు. ముగ్గురు వెనకసీట్లో భావనను పట్టుకు కూర్చున్నారు. ఒకచేయి భావన నోటిని మూసి ఉంచితే నాలుగు చేతులు ఆమె కాళ్ళూ చేతుల్నీ కదలకుండా పట్టుకుని వుంచాయి. ఒకచేయి మాత్రం ఆమె శరీరం మీద కదుల్తోంది మోహంతోనూ, మొరటుగానూ.

కారు ఆగే సమయానికి దాదాపు ఆమె వొంట్లో శక్తి అంతా హరించుకుపోయింది. నిస్సహాయంగా వాళ్ళచేతుల్లో వేళ్ళాడి పోయిందామె.

వాళ్ళు తనను భవనం లోపలికి తీసుకుపోతుంటే కూడా ఆమె ఏమీ చేయలేకపోయింది. భవనం లోపలికి పోగానే వాళ్ళు తలుపులు బంధించుతున్నప్పుడు మాత్రం ఆమెకు ఒక్కసారిగా గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే ఆమె శక్తినంతా కూడదీసుకుని తనను పట్టుకున్న వాళ్ళను విదిలించుకుని వెర్రిగా కేకలు పెట్టింది.

ఒక్కక్షణం మాత్రమే ఆ ఆర్తనాదాలు బయటికి వినిపించాయి. ఆ వెంటనే తలుపులు మూసుకోవటమూ, ఆమెను లోపలి గదుల్లోకి తీసుకుపోవటమూ జరగటంతో ఆమె ఆర్తనాదాలు ఆమెతోటే లోపల బంధించబడ్డాయి...

## 5

టూ టౌను పోలీసుస్టేషను ఎస్సై పేరు ప్రసాదరావు. అతను అంతకుముందే ఐజీ యిచ్చిన ఉపన్యాసాన్ని నెమరువేసుకుంటూ నడుస్తున్నాడు ఆ అర్ధరాత్రి టౌన్లోని చీకటి వీధుల గుండా. రాష్ట్రమంతటా నేరాలు, కల్లోలాలు, అరాచకత్వాలు ఎక్కువయ్యాయి. కారణం పాలకుల అసమర్థతా, అవినీతియే అయినా నిందించబడుతోంది మాత్రం పోలీసు శాఖ! అందుకు తగ్గట్టు మానభంగాల్లోనేమీ, దొంగతనాల్లోనేమీ ఇత్యాదుల్లో కొన్నిచోట్ల పోలీసులే నేరస్థులుగా బయట పడుతుండటంతో ప్రజలకు పోలీసుశాఖపట్ల విశ్వాసం హరించుకుపోతోంది. కొత్తగా వచ్చిన ఐజీ నిజాయితీపరుడూ, ఆదర్శభావాలు కలవాడూ కావటంతో ఈ పరిస్థితిని మార్చటానికని ఆయన రాష్ట్రమంతటా పర్యటిస్తూ తనక్రింద అధికార్లకు క్లాసులు నిర్వహిస్తున్నాడు. అందులో వొక భాగమే ఇవాల్టి ఆయన వుపన్యాసం. ప్రజలలో నమ్మకం కలిగేటట్లు ప్రవర్తించమనీ, మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఎవరినీ హింసించవద్దనీ, తోటి ప్రజలకు ఆదర్శంగా నిలబడుతూ వాళ్ళ సహకార సానుభూతుల్ని సంపాదించమనీ, పాతకాలపు జులుంని విసర్జించమనీ, సంస్కారాన్ని అలవర్చుకోమనీ,

ఆర్తులను ఆదుకోమనీ, యిలా బోధించా డాయన.

ప్రసాదరావు స్వతహా ఆదర్శవాది కావటంతో ఆయన వుపన్యాసం అతణ్ని ఆకట్టుకోవటమే కాకుండా ఉత్తేజపరిచింది కూడా.

నడుస్తున్నాడు ప్రసాదరావు. ఇంటివద్ద తనకోసం ఎదురుచూస్తుండే రమ రూపం గుర్తుకొచ్చి అతని అడుగులు మరింత వేగంగా ముందుకు పడ్డాయి.

స్థానిక ఎంపీ కొడుకు చంద్రం భవనం ముందుకు రాగానే హఠాత్తుగా అతని కాళ్ళకు బ్రేకులుపడ్డాయి. అంతకు మునుపే ఓ చిన్న కారు గేటు లోపలికి వెళ్ళటం గమనించాడతను. ఆ కారు ఆగేసమయానికి అతను గేటుముందు భాగానికి వచ్చాడు. కార్లోంచి ఎవర్నో చేతులు పట్టి తీసుకుపోవటాన్ని చూసాడు కూడా. ఎవర్నో రోగిష్టి మనిషిని తీసుకుపోతున్నారు గావును అనుకున్నాడు. ఎప్పుడయితే ఆ ఇంటి తలుపులు తెరవబడటమూ, ఆ వెల్తురులో ఓ స్త్రీ గింజుకుంటూ కేకలు వేయడమూ కనిపించిందో ఆ వెంటనే అతను గేట్లోంచి లోపలకు ప్రవేశించాడు. కాని అతను వెళ్ళేసరికి ఆ తలుపులు మూసుకున్నాయి.

తలుపులు తట్టాడు ప్రసాదరావు. ఎవరూ తెరపలేదు. దబాదబా బాదాడు. అప్పటికీ తెరవబడలేదు. అలా బాదుతూనే వున్నాడు ఆఖరికి తెరుచుకున్నాయి.

తెరిచిన వాడు దుర్ముఖుడు—తన బాస్ కొడుకు గోపాల్.

ఎవరు నువ్వన్నాడతను. ఎస్సై ప్రసాదరావునన్నాడితను. నేనెవరో తెలుసా అన్నాడతను. తెలుసును. డీ ఎస్పీ కొడుకువి అన్నాడతను. ఇంతకీ ఏం కావాలన్నాడతను. తను చూసిన దృశ్యాన్ని చెప్పాడతను. అయితే లోపలికి రమన్నాడతను. వెళ్ళాడితను.

మళ్ళీ తలుపులు మూసుకున్నాయి.

గదిమధ్య నిలబడివున్నాడు ప్రసాదరావు.

అతని ముందు నిలబడివున్నాడు గోపాల్

ఇప్పుడేమంటావ్ ఇంతకీ? అనడిగాడు గోపాల్. ఎవర్నో మీరు కిడ్నాప్‌చేసి తెచ్చినట్లున్నారు, ఇంటిని సోదా చెయ్యాలన్నాడు ప్రసాదరావు. వారంటు తెచ్చావా అనడిగాడతను. లేదన్నాడితను. మరెట్లా అన్నాడతను. నీకున్న హక్కేంటదీ అనడిగాడు పైగా. అసలు నువ్విప్పుడు డ్యూటీలో వున్నావా? అనడిగాడు కూడా. బాధ్యతాయుతమైన పౌరుడిగా నాకా హక్కుంది అన్నాడతను. అట్లాగా అన్నాడతను. అవునన్నాడితను.

ఈలోపు మిగతా వేపుల్నించి ప్రకాష్, మౌళి, చంద్రం కమ్ముకోసాగారితణ్ని.

## 6

గదిలో లైట్లు తీసివేసి కిటికీవద్ద కూర్చుని వుంది రమ. ఆమె అట్లా ఎప్పుణ్నించో అక్కడ కూర్చుని ఎదురు చూస్తోంది.

ప్రసాదం! అతను ప్రసాదం కాడు, తన పాలిటి దేవుడు! రూపవంతుడూ, గుణవంతుడూ. మరి తనో? మామూలు అందగత్తె అన్నా కాదు. కలవారింటి కూతురన్నా కాదు. జీవచ్ఛంలా అనాథ శరణాలయంలో బ్రతుకుతుంటే—ప్రసాదం చూసి—తన నడవడికను మెచ్చుకుని—రూపం కాదు గుణం ముఖ్యమని—పెళ్ళాడాడు మూడేళ్ళ క్రితం. అప్పటికే అతను ఎస్సై. ధర్మానికి నిలబడ్డవాడు—అవినీతికి లొంగనివాడు—తనను ప్రేమగా చూసుకుంటున్నవాడు—దేవుడు కాక మరేమిటి?


ఊళ్ళోకి ఐజీ వచ్చాడనీ, తను తిరిగి వచ్చేసరికి బాగా ప్రొద్దుపోవచ్చనీ, ఎదురు చూడక నిద్రపొమ్మనీ, చెప్పి వెళ్ళాడు. కాని తను అప్పణ్నించీ ఎదురుచూస్తూనే వుంది. ఆ మాత్రం నిద్రని త్యాగం చెయ్యలేదా తను తన దేవుడి ప్రేమకోసం!?

ఎత్తుగావున్న పొట్టను ఓ సారి మృదువుగా తడుముకుంది రమ ఎవరు ఎదుగుతున్నారు లోపల? జూనియర్ ప్రసాదమా? జూనియర్ ప్రసాదినియా?? నవ్వుకుంది చిన్నగా

మరి ప్రసాదరావు ఏం చేస్తున్నాడు???

## 7

మంకుపట్టు వీడకపోయే సరికి—




మీ సొలూస్తున్నాయని మీరేం గాబరా పడకండి!! హా హ్హాహ్హా!!
సిల్వర్ ఫిష్ బ్లేడునే వాడండి! టింటర్ర్ ట్రాహాం!!

మాటా మాటా పెరిగి—

ఏం జరుగుతుందో గ్రహించే అవకాశమన్నా లేక—

ఎదురు తిరిగే వ్యవధన్నా లేక—

ఒకడు మాడుమీద బలంగా బాదితే,

మరోడు కడుపులో కత్తితో పొడవగా,

ఇంకోడు గొంతులో చాకును గుచ్చగా—

జలజలా రక్తం ఓడుతూ,

గిలగిలా అవయవాలు కొట్టుకుంటుండగా -

నేల కొరిగి,

అభిమన్యుడిలా, బాలచంద్రుడిలా

## 8

మూడ్రోజుల తర్వాత!

ఊరి చివర పాడుబడిన బావిలో రెండు శవాలు కనుగొనబడ్డాయి.

ఒకటి ఎస్సై ప్రసాదరావుదయితే రెండోది టీనేజ్ పిల్ల భావనది.

ఆ పైన రకరకాల ఊహాగానాలూ, కట్టు కథలూ.

శవ పరీక్షలో ఆ పిల్ల కొందరిచేత బలవంతంగా అనుభవించపడగా చనిపోయిందని తేలింది

## 9

పోలీసుశాఖలో అందరూ అవినీతిపరులే లేరనటానికి ఉదాహరణ బోసుబాబు. ప్రసాదరావు హత్యవార్తా, భావన రేప్‌తో కూడిన మరణవార్తా విని కొత్త ఐజీ షాక్ తిన్నాడు. వెంటనే అతను తన దృష్టిలో నిజాయితీపరుడూ, మెరికలాంటివాడూ అనుకున్న బోసుబాబును పంపాడు ఇన్వెస్టిగేట్ చేయటానికి. ఆయన ఆశ ఫలించింది కూడా. త్వరలోనే బోసుబాబు దుష్టచతుష్టయాన్ని కనిపెట్టి, అరెస్టుచేసి, కేసు తయారుచేసాడు. యంపీగారి పరపతిగానీ, డిఎస్పీ హోదాగానీ బోసుబాబు ముందు పనిచేయలేదు. ఇక మిగిలింది కోర్టు తతంగం! మనది ప్రజాస్వామ్య రాజ్యాంగం కావటంతో ఆ తతంగం చాలా సుదీర్ఘంగా సాగి ఆఖరికి ఎనిమిదేళ్ళు, పదేళ్ళు, అంటూ ఇలా తలా కొంత శిక్షలు పడ్డాయి.

ఇంతటితో ఆగిపోయినట్లయితే బాగానే వుండేది. ఎంతో కొంత న్యాయం జరిగిందన్న సంతృప్తి మిగిలేది సామాన్యుడికి. కాని అట్లా జరగలేదు—

దుష్ట చతుష్టయమూ, తత్సంబంధీకులూ తమకు చాలా అన్యాయం(?) జరిగిందనుకోవడంతో పైకోర్టుకు అపీలు చేసుకున్నారు.

మళ్ళీ అక్కడ మూడేళ్ళు జరిగింది విచారణ. ప్రత్యక్షసాక్షులెవరూ లేరు కాబట్టి ముద్దాయిలను వదిలివేయాల్సిందంటూ ఈ కోర్టు కాస్తా తీర్పు చెప్పింది.

ఇదెక్కడి ఫార్సు???

అట్లా అని ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఈ దేశంలో అనేకానేక ఫార్సుల్లో ఇదొకటి! □